తిరుపతి । బుధవారం । 20 । నవంబర్ । 2024

క్లుప్తంగా

ఆశ్రమాలలో అన్నదానం



వృద్ధాశ్రమంలో భోజనం పంపిణీ

గూడూరు రూరల్: గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని రెండు అనాథాశ్రమాలలో మంగళవారం ఇద్దరు దాతలు వారి కుటుంబ సభ్యుల పేరు మీద అన్నదానం నిర్వహించారు. రెండో పట్టణంలోని అడవయ్య కాలనీలో ఉన్న గాడ్ గ్రేస్ సొసైటీ అనాథ శరణాలయంలో చిల్లకూరు శ్రీనివాస టపాసుల అంగడి నిర్వాహకులు సురేంద్ర, సుధీర్ భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో కూరపాటి రవీంద్రబాబు, బాబు జాన్‌పాల్, గఫూర్, సుధీర్, శ్రీను, జయ రామయ్య తదితరులు పాల్గొన్నారు. పట్టణం లోని గమళ్లపాళెంలో మై ఫ్రెండ్స్ వృద్ధాశ్రమం లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చెంచు నారాయణ, పురుషోత్తం, ఇబ్రహీం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తురిమెర్లలో విద్యార్థులకు టాలెంట్ పరీక్షలు



టాలెంట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సైదాపురం: మండలంలోని తురిమెర్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏఎస్ఏ అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు కలిచేడు, ఊటుకూరు ఉన్నత పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఏ అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు షఫీ హరన్ మాట్లాడుతూ ఈ టాలెంట్ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో ఉన్న టాలెంట్ బయటకు వస్తుందన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న నవజీవన్ సంస్థ ప్రతినిధులు

దొరవారిసత్రం: స్థానిక కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినులకు మంగళవారం నవజీవన్ ఆర్గనైజేషన్ సంస్థ ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కల్పించింది. అలాగే అగ్రహారంలో అవగాహన ర్యాలీ నిర్వహించడంతోపాటు వైద్య పరీక్షలు చేసింది. సంస్థ సభ్యులు మాట్లాడుతూ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీ, కేజీబీవీ ప్రిన్సిపల్ పార్వతి, సిబ్బంది సుమతి, ఐశ్వర్య, వెన్నెల, నాగార్జునమ్మ పాల్గొన్నారు.


11 మద్యం బాటిళ్లు స్వాధీనం

వాకాడు: మద్యం బెల్టు షాపులపై మంగళవారం వాకాడు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జెమిన్ కొత్తపాళెం గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న కుంబాల అంకయ్య వద్ద 11 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠినమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

కండలేరులో 52.022 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 52.022 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 1800 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 720, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గేదెల కోసం వెళితే దాడి చేశారు



గాయపడిన బాధితుడు రవి

చిల్లకూరు: గూడూరులోని ఓ పాడి రైతుకు చెందిన గేదెలు నెల రోజులుగా కనిపించక పోవడంతో వాటిని వెతుకుతూ వెళ్తే తనపై దాడికి పాల్పడ్డారని బాధితుడు తెలిపాడు. బాధితుడు రవి అందించిన సమాచారం మేరకు.. చిల్లకూరు మండలం గుత్తావారిపాళెం గ్రామంలో తన గేదెలు ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి చేరుకున్నాడు. గేదెలు ఉన్న ఇంటి వారిని అడగగా వారు తనపై దాడి చేశారని గూడూరు కోనేటిమిట్టకు రవి తెలిపారు. గుత్తావారిపాళెం లోని మణి అనే వ్యక్తి తనపై దాడికి పాల్పడినట్లు తెలిపాడు. తాను గూడూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

జలదిగ్బంధంలో సిద్ధేశ్వరుడు



జలదిగ్బంధంలో ఆలయ గర్భగుడి



శిథిలావస్థలో శ్రీజలసిద్ధేశ్వరస్వామి ఆలయం

- నిధులు ఉన్నా నిద్రపోతున్న దేవదాయ శాఖ

వాకాడు: కార్తీక మాసంలో భక్తజనంతో నిండుకుని పూజలు అందుకోవాల్సిన శ్రీజల సిద్ధేశ్వర స్వామివారి ఆలయం జల దిగ్బంధనంలో చిక్కుకుంది. వాకాడు మండలం నెల్లిపూడి పంచాయితీ పరిధిలోని వెంకటరెడ్డిపాళెం గ్రామంలో స్వర్ణముఖినదీ తీరాన ఎంతో చరిత్ర కల్గిన పురాతన శ్రీకామాక్షి దేవి సమేత శ్రీజలసిద్ధేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆలయం చుట్టూ మూడు అడుగుల లోతు వర్షపు నీరు చేరడమే కాకుండా స్వామివారి గర్భగుడిలోకి సైతం వరద నీరు చేరింది. అందులోని శివలింగం కనిపించని విధంగా పూర్తిగా నీటిలో మునిగిపోయింది. కార్తీక మాస పూజల కోసం ఆలయానికి వచ్చిన భక్త జనం పూజలు ఎక్కడ చేయాలో తెలియక వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ ఆలయానికి లక్షలాది రూపాయల విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. అయితే ఆలయంపై రావిచెట్లు, పిచ్చి మొక్కల మొలచి నెర్రెలు బారుతున్నా తొలగించే దిక్కు లేకుండాపోయింది. ఆలయానికి సబంధించి కనీస చర్యలు కూడా ఎండోమెంటు అధికారులు చేపట్టకపోవడం గమనార్హం. శ్రీజలసిద్ధేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 12.79 ఎకరాలు భూమి ఉంది. ఏటా భూములకు లీజు వేలం పాట నిర్వహిస్తున్నారు. ఇలా వచ్చే ఆదాయం స్వామి వారి ఖాతాలో దాదాపు రూ.15 లక్షలు పైగా ఉంది. ఇలా వచ్చే నిధులు ఏమవుతున్నాయోనని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

లోతట్టు ప్రాంతంలో ఆలయం

ఆలయ ప్రాంగణంలో శివలింగంతోపాటు అమ్మవారి విగ్రహం, గుడి బయట ఉన్న వినాయకుడి విగ్రహం, ఎదురుగా ఉన్న నందీశ్వరుడి విగ్రహాలు వరద నీటిలో మునిగిపోయాయి. ఆలయ ప్రాంగణం ఎత్తు చేయకపోవడంతో వర్షం వస్తే స్వర్ణముఖినది పొర్లుకట్టలపై పడిన నీరంతా ఆలయంలో చేరుతోంది. అంతేకాకుండా పక్కనే ఉన్న పొలాల నీరంతా ఆలయం వైపే రావడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో జలసిద్ధేశ్వర ఆలయం జలదిగ్బంధనంలో ఉంటుంది. దీంతో గర్భగుడిలోని శివలింగం నాలుగు అడుగుల వరద నీటి లోతులో మునిగి పోతుంది.

కార్తీక మాస పూజలు కరువు

కార్తీక మాసంలో మహిళలు ప్రతి సోమ, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు, కార్తీక దీపాలను వెలిగించేందుకు వీలు లేకుండా పోయింది. ఆలయంలో నీరు చేరి శివలింగం పూర్తిగా మునిగి పోవడమే కాకుండా, అమ్మవారైన శ్రీకామాక్షిదేవి విగ్రహం కూడా సగం వరకు నీళ్లల్లో మునిగి పోయింది. ఎండోమెంటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్తీక మాసంలో శ్రీజల సిద్ధేశ్వరస్వామి జలదిగ్బంధనానికి గురై పూజలకు నోచుకోకుండా పోయాడని మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘన చరిత్ర ఉన్న ఆలయం



నెల్లిపూడి పంచాయతీలోని వెంకటరెడ్డిపాళెం గ్రామంలో వెలసిన శ్రీజల సిద్ధేశ్వరస్వామికి పవిత్రమైన కార్తీక మాసంలో కూడా ధూప దీప నేవేద్యాలు అందకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా దేవదాయ అధికారులు స్పందించి ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. నిత్య పూజలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి.

\- సూరిశెట్టి విజయ్‌కుమార్, నెల్లిపూడి

నిధులు ఉన్నా అభివృద్ధి లేదు



ఆలయానికి వచ్చే ఆదాయ వనరులు ఏమవుతున్నాయో తెలియడం లేదు. జలదిగ్బంధనంలో ఉన్న ఆలయ ఆవరణలో కనీసం మట్టి కూడా తోలిన పాపాన పోలేదు. ఆలయానికి వచ్చే భక్తులకు అగచాట్లు తప్ప స్వామివారి దర్శనం లేదు. ఈ ఆలయాన్ని బాగు చేయాలని ఎన్నో ఏళ్ల నుంచి ఎండోమెంటు అధికారులకు చెబుతున్నాం. అయినా ఇక్కడ కనీస అభివృద్ధి జరగడం లేదు. మా గ్రామంలో చారిత్రాత్మక ఆలయం ఉన్నా పూజలు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది.

\- అలిమిలి వినోద్ శివభక్తుడు, నెల్లిపూడి

ప్రతిపాదనలు పంపించాం

శ్రీజలసిద్ధేశ్వర స్వామి ఆలయం జలదిగ్బంధంలో ఉండడం నిజమే. అయితే ఆలయ అభివృద్ధి కోసం గత ఏడాదిలోనే ప్రతిపాదనలు పంపించాం. ఆదేశాలు వచ్చే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఆలయ అభివృద్ధి నిలిచిపోయింది. త్వరలో ఆలయ అభివృద్ధికి ఒక నిర్ణయం తీసుకుంటాం.

\- హేమంత్, దేవదాయ శాఖ ఉద్యోగి, నెల్లిపూడి

ప్రత్యామ్నాయ భూములు ఇచ్చేందుకు చర్యలు



ఆల్తూరుపాడు రిజర్వాయర్ వద్ద గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

దక్కిలి: మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు అటవీశాఖకు చెందిన 50 ఎకరాల భూమిని తీసుకున్నందుకు గాను ప్రత్యామ్నాయంగా అటవీ శాఖకు భూమి కేటాయించనున్నట్లు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. మంగళవారం మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను గూడూరు సబ్ కలెక్టర్ రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగ్గవోలు గ్రామంలో 197 సర్వే నెంబరులో ఉన్న భూమిలో 100 ఎకరాలు అటవీశాఖకు అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆల్తూరుపాడు గ్రామంలో రిజర్వాయర్ నిర్మాణానికి అటవీశాఖ ఇచ్చిన భూములకు ప్రత్యామ్నాయంగా ఇచ్చేందుకు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. అనంతరం రిజర్వాయర్ డిజైన్, పలు రికార్డులను పరిశీలించారు. రాపూరు మండలంలోని కండలేరు నుంచి తిరుపతి జిల్లా శ్రీసిటీ వరకు నిర్మించనున్న పైప్‌లైన్‌కు సంబంధించి దక్కిలిలో పనులు నిలిచిపోవడంపై ఆయన పరిశీలించారు. పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయేవారికి నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. నష్టపరిహారం త్వరతగతిన అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమలో తహసీల్దార్ మోహూరు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

సూళ్లూరుపేట రూరల్: మహిళలు స్త్రీల హక్కుల గురుంచి తెలుసుకోవాలని సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.అనిల్‌కుమార్ కోరారు. మున్సిపాలిటీలోని స్త్రీ శక్తి భవనంలో మెప్మా సభ్యులకు మంగళవారం మండల న్యాయ సేవా అధికార సంస్థ స్త్రీల హక్కులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. జడ్జి మాట్లాడుతూ, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా ఉండటం వల్ల మహిళలు మొబైల్ వాడకం తగ్గించాలన్నారు. ఖాళీ ప్రామిసరి నోట్‌లో అప్పులు చేయరాదన్నారు. స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కులు ఉన్నాయన్నారు. మహిళలతో అవమానకరంగా మాట్లాడినా, అసభ్య పదాలతో దూషించినా, లైంగికంగా వేధించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. మహిళలకు సంబంధించి వివిధ చట్టాలు, హక్కులను తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.ధర్మాప్రసాద్, పి.లక్ష్మయ్య, లొక్కు చలపతి, వి.ప్రసాద్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

భూసారం ఆధారంగా పంటల సాగు



పంటల సాగుపై రైతులకు అవగాహన

వెంకటగిరి రూరల్: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని పెట్లూరు నిమ్మ, చీనీ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఈకే నాయక్ పేర్కొన్నారు. మండలంలోని కుప్పంపల్లి, అమ్మపాళెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టిసేకరణ, ఖనిజ నిష్పత్తుల ఫలితాల ఆధారంగా పలు రకాల పంటలపై దృష్టి సారించాలన్నారు. ఎరువుల యాజమాన్యం, జీవ ఎరువుల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజీవన మాట్లాడుతూ పొటాష్ ఎరువులు వాడడంతో పైరు రోగ నిరోధక శక్తి కలిగి, చీడపీడలను తట్టుకుని నాణ్యమైన దిగుబడులను ఇస్తుందని తెలిపారు. మండల ఏఓ సుజాత మాట్లాడుతూ రైతులు పంటల సాగులో యాంత్రీకరణపై దృష్టి సారించాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడంపై సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ రామ్మోహన్, వీఏఏ రేఖ, జడ్బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్న లైబ్రేరియన్ తదితరులు

నాయుడుపేటటౌన్: స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. తొలుత పలువురు వక్తలు గ్రంథాలయం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విజేతలకు ముగింపు రోజు బహుమతులను ఇవ్వనున్నట్లు లైబ్రేరియన్ షేక్ అతావుల్లా తెలిపారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం బెల్టు షాపులపై ఎస్పీకి ఫిర్యాదు

పెళ్లకూరు: మండలంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న 112 మద్యం బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మంగళవారం తిరుపతిలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం బెల్టు దుకాణాలు నిర్వహించే వారిని ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మద్యం షాపుల నిర్వాహకులతో లాలూచీ పడ్డారని, మండలంలో పెళ్లకూరు, చెంబేడులో అధికారికంగా రెండు మద్యం షాపులు ఉన్నాయని, మొత్తం 24 పంచాయతీల్లో 112 బెల్టు షాపులు నిర్వహిస్తూ ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ50 వసూలు చేస్తున్నారని ఎస్పీకి నివేదించారు. ఉన్నతాధికారులను మెప్పించడం కోసం నామమాత్రపు దాడులు చేసి కేసులు పెడుతున్నారని, బెల్టు దుకాణాలకు పూర్తిగా చెక్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బెల్టు దుకాణాల వల్ల ఊరూరా మద్యం ఏరులై పారుతోందని, వీటిమూలాన పేద కుటుంబాలు నాశనమైపోతున్నాయని ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు.

డీఏపీతో మంచి ఫలితాలు



దక్కిలి: రైతులకు మట్టి నమూనా పత్రాలను అందజేస్తున్న అధికారులు

దక్కిలి: వరి సాగుకు ముందు దుక్కిలో డీఏపీ వాడితే మంచి ఫలితాలు ఉంటాయని, నత్రజని ఎరువు(యూరియా)ను మూడు దఫాలుగా వాడ డం మంచిదని వెంకటగిరి వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జున సాగర్ తెలిపారు. మండలంలోని పలుగోడు, నాగులపాడు గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ఏడీఏ స్వామిబాబు మాట్లాడు తూ పశువులకు టీకాలు, సబ్సిడీపై పాకల నిర్మా ణం, పేడ, మూత్రం పరీక్షలు చేసేందుకు వెంకటగిరిలో ల్యాబ్ అందుబాటులో ఉందని వినియోగించుకోవచ్చునన్నారు. నిమ్మ పరిశోధన శాస్త్రవేత్త ప్రతాప్ మాట్లాడుతూ నిమ్మలో మేలైన రకాలు, ఎరువుల యాజమాన్యం, తోటల పెంపకం, సేంద్రియ వ్యవసాయ విధానాలను తెలియజేశారు. మట్టి నమూనాలను పరీక్షించి వాటి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి విజయభారతి, వీఏఏ అశోక్, రైతులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీ ఎంపీటీసీ మృతి



రేవూరు రామచంద్రయ్య

రాపూరు: రాపూరు బిట్–2 ఎంపీటీసీ, వైఎస్ఆర్ సీపీ నాయకుడు, పెంచలకోన దేవస్థానం కమిటీ మాజీ సభ్యుడు రేవూరు రామచంద్రయ్య(53) సోమవారం రాత్రి మృతి చెందాడు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆయన మృతికి వైఎస్ఆర్ సీపీ నాయకులు, ఇతర పార్టీల నాయకులు సంతాపాన్ని తెలియజేశారు. ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు.

నేటి నుంచి జోనల్ క్రీడలు

కోట: స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా మైదానంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు ఎస్సీ గురుకులాల జోనల్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. జోనల్ పరిధిలోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లోని 30 పాఠశాలల నుంచి 650 మంది విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడల నిర్వహణ కోసం మైదానాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఖుర్షీద్ సాహెబ్ మృతికి సంతాపం

వాకాడు: గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు షేక్ ఖుర్షీద్ సాహెబ్ మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వైఎస్ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిమ్మలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సైదాపురం: నిమ్మ తోటలు సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ హైమావతి కోరారు. మండలంలోని గులించెర్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సమగ్రంగా వివరించారు. ప్రతి రైతు ఈ–పంటను నమోదు చేసుకోవాలని కోరారు.

కోట: మండలంలోని కొత్తపాళెం, నెల్లూరుపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి నారుమడిలో కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించినట్లు ఏఓ నిరంజన్‌కుమార్ తెలిపారు. సబ్సిడీలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు. వీటి ఆధారంగా ఎరువులను ఎంత మోతాదులో వినియోగించాలో రైతులకు వివరించారు. వీఏఓలు సాయికుమార్, ప్రభుకిరణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మూలనపడ్డ చెత్త సేకరణ సైకిళ్లు



సచివాలయం ఆవరణలో చెత్త సేకరించే సైకిల్

దొరవారిసత్రం: మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీలకు గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు ప్రతి గ్రామానికి రెండేసి చొప్పున మూడు చక్రాల సైకిళ్లను స్వచ్ఛ భారత్ కింద కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట సరఫరా చేసింది. వీటితో పాటు ప్రతి ఇంటికి వెళ్లి తడి ,పొడి చెత్తను సేకరించేందుకు ఇద్దరు గ్రీన్ అంబాసిడర్లను కూడా నియమించారు. అయితే సైకిళ్ల నిర్వహణ గాలికి వదిలేశారు. దీంతో ప్రతి పంచాయతీకి చెందిన సైకిళ్లు సకాలంలో మరమ్మతులు నోచుకోక మూలన పడి శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని పంచాయతీల్లో అయితే ఈసైకిళ్లను వినియోగించకనే వదిలేయడంతో తుప్పు పట్టి ఎందుకు పనికి రాకుండాపోయాయి.


దుర్గామల్లేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



అన్నాభిషేక పూజలు

నాయుడుపేట టౌన్: తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ప్రతిష్టించి ఉన్న శివలింగానికి అన్నాభిషేక పూజలను భక్తుల నడుమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దీపాలతో శివలింగాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. పలు శివాలయాల్లో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైలు పట్టాలు దాటేదెలా?



అక్కరపాక బ్రిడ్జిలో భారీగా చేలిన వర్షపు నీరు



నెలబల్లి గ్రామ సమీపంలో అండర్‌పాస్‌లో నిలిచిన నీరు

- అండర్ పాస్ బ్రిడ్జిలలో భారీగా నిలిచిన వర్షపునీరు
- నిర్వహణ మరిచిన రైల్వే అధికారులు
- ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం

దొరవారిసత్రం: అక్కరపాక, నెలబల్లి, మినమనముడి, మేలుపాక గ్రామాల్లో రైలు పట్టాలు దాటే ప్రాంతాల్లో అండర్ పాస్ బ్రిడ్జిలలోకి వర్షపు నీరు చేరడంతో పలు గ్రామాలకు రాకపోకల్లో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో రైతుల ఎరువులు ఇతర సామగ్రి తీసుకువెళ్లాలన్నా నానాతిప్పలు పడాల్సి వస్తుంది. నిన్నమొన్నటి వరకు కురిసిన వానలకు అండర్ పాస్ బ్రిడ్జిలలో భారీగా వర్షపు నీరు చేరింది. దీని కారణంగా పాదచారులు, ద్విచక్ర, ఆటో వాహనదారులు దాటలేక నానాతిప్పలు పడుతున్నారు. బ్రిడ్జిలలో వర్షపు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించే విధంగా మోటార్లు ఏర్పాటు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఎక్కడి నీరు అక్కడే ఆగిపోతోంది. వీటి నిర్వహణ విషయం సంబంధిత రైల్వే అధికారులకు తెలిసినప్పటికీ ఏమి పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

డీవీ సత్రంలో తప్ప..

దొరవారిసత్రంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో తప్ప మిగిలిన ప్రాంతాల్లో ఎక్కడా కూడా వర్షం నీటి తోడేసే పనులు చేపట్టడం లేదు. అక్కరపాక, నెలబల్లి గ్రామాల సమీపంలోని అండర్ పాస్ బ్రిడ్జిలలో పది అడుగుల పైబడి వర్షపు నీరు చేరడంతో అటుగా వెళ్లే ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతాల్లోని బ్రిడ్జిలను దాటి పొలాల్లో వ్యవసాయ పనులు చేపట్టే రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం.

రైతులే నీళ్లను తోడుకుంటున్నాం...

అక్కరపాక గ్రామ సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జిలో నిలిచిన నీళ్లను ఎప్పటికప్పుడు రైతులే ఆయిల్ ఇంజిన్‌లో డీజిల్ పోసుకుని తోడుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు ఏమీ పట్టించుకోవడంలేదు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టనట్లు ఉన్నారు.

\- వెంకటయ్య, రైతు, అక్కరపాక గ్రామం

వర్షాకాలంలో ఇబ్బందులు

వర్షాకాలం వస్తుందంటే రైల్వే బ్రిడ్జిని దాటలేకపోతున్నాం. బ్రిడ్జిలోకి వర్షపు నీరు భారీగా చేరడంతో అటుగా వెళ్లి పొలంలో వ్యవసాయ పనులు చేసుకోలేని పరిస్థితి. ఒక వేళ రైలు పట్టాలు దాటి వెళ్లినా పొలంలో పనులు చేసేందుకు ట్రాక్టర్లు వెళ్ల లేకపోతున్నాయి. పంటకు ఎరువులు వేసేందుకు నానాతిప్పలు పడుతున్నాం.

\- సుబ్రమణ్యం, రైతు, నెలబల్లి గ్రామం